కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే గాంధీ



గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావును శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ గురువారం కలిశారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కేసీఆర్‌ను గాంధీ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ విజయానికి కష్టపడాలని సూచించారు.

చేయూత



రాయదుర్గం: నానక్‌రాంగూడలోని అంగన్‌వాడీ కేంద్రాలకు స్థానిక నాయకుడు సంజీవరెడ్డి చేయూత ఇచ్చారు.నానక్‌రాంగూడలో ప్రభుత్వ పాఠశాలలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, మహిళా భవన్‌లో మరొక అంగన్‌వాడీ కేంద్రం ఉన్నాయి.ఈ కేంద్రాలకు డోర్ మ్యాట్‌లను, వాటర్ క్యాన్లను అంగన్‌వాడీ టీచర్లకు అందించారు.

మోడల్ రోడ్డేనా..?

- మొదటిదశ సరే.. రెండోదశ ఎప్పుడో..
- సర్వీస్ రోడ్డుకు స్థల సేకరణ ఏదీ..
- ఖాజాగూడ –నానక్‌రాంగూడ రోడ్డు దుస్థితి

అబ్బురపరిచే రహదారి నిర్మాణం.. ఆశించిన స్థాయిలో పూర్తికాక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇదీ మధురానగర్ దాబా కూడలి నుంచి ప్రశాంత్‌హిల్స్ గేటు, ఖాజాగూడ మీదుగా ఔటర్ రింగురోడ్డు అండర్‌పాస్ వరకు నిర్మించిన రహదారి దుస్థితి.

రాయదుర్గం: ఔటర్ రింగురోడ్డు, ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతానికి, గౌలిదొడ్డి, గోపన్‌పల్లి, గోపన్‌పల్లి తండా, బసవతారక నగర్, కేశవనగర్, నార్సింగి లాంటి ప్రాంతాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన దారి. దీంతో ఈ మార్గం గుండా నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీనికి తోడు ఓక్రిడ్జ్ అంతర్జాతీయ పాఠశాల, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కూడా ఇదే రోడ్డులో ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యం కలిగిన మార్గం కావడంతో మాజీ మంత్రి శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రత్యేక చొరవ తీసుకొని ఈ రోడ్డు నిర్మాణం చేపట్టారు.

మోడల్ రోడ్డు వివరాలు..

మోడల్ రోడ్డు నిర్మాణం మొదటి దశ కోసం రూ.45 కోట్లు వెచ్చించారు. ఈ నిధులతో ఆరులేన్ల రోడ్డు, సెంట్రల్ డివైడర్, గ్రీనరీ, రోడ్డుకు ఇరువైపులా లైటింగ్ పనులు పూర్తి చేశారు. అంతేకాకుండా మధురానగర్‌లోని దాబా కూడలి నుంచి నానక్‌రాంగూడా వరకు రహదారి నిర్మించారు. ఈక్రమంలో రెండో దశలో భూసేకరణ చేపట్టి సర్వీసు రోడ్డు, డక్ట్, డ్రైనేజీ కాల్వలు, ఫుట్‌పాత్‌లు నిర్మించాలని ప్రతిపాదించారు. అయితే, ఇప్పటి వరకు భూసేకరణ చేయలేదు. తాజాగా సైకిల్ ట్రాక్, ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టి మధ్యలో నిలిపివేశారు.

సాఫీగా రాకపోకలు..

గతంలో సింగిల్ రోడ్డులో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగేవి. ప్రస్తుతం రాకపోకలు సాఫీగా జరుగుతున్నాయి. అయితే, ఆరంభంలో రోడ్డు తవ్వి పైప్‌లైన్ తొలగించగా ఇప్పటికీ పనులు కొనసాగించలేదు. మోడల్ రోడ్డు నిర్మాణంలో మధురానగర్ ప్రాంతంలో ఇప్పటి వరకు రహదారికి ఒక వైపు కూడా ఎలాంటి విస్తరణ పనులు చేపట్టకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్ల క్రితం మధురానగర్‌లో విస్తరణ కోసం ప్రధాన రోడ్డును తవ్వారు. ఈ సమయంలోనే రోడ్డు పక్కనున్న బోరుతో అనుసంధానం చేసిన పైప్‌లైన్‌ను తొలగించారు. ఈ పైప్‌లైన్ బస్తీలోని మినీ ట్యాంక్‌లకు బోరు నీటిని సరఫరా చేసేది. అయితే, పైప్‌లైన్ ఇప్పటి వరకు వేయకపోవడం అధికారులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆగిన నిర్మాణ పనులు

తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల ముందు ఇరువైపులా రూ.10 లక్షల వ్యయంతో ఈ మోడల్ రోడ్డులో సైకిల్ ట్రాక్, ఫుట్‌పాత్‌లు నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. అంతేకాదు ఆగమేఘాల మీద ఈ పనులను మధురానగర్‌లో ప్రారంభించారు. అనంతరం ఎన్నికల షెడ్యూల్ రావడంతో పనులు నిలిపివేశారు. ఎన్నికల ఫలితాల్లో ప్రభుత్వం మారడంతో ఈ పనులు ఎప్పుడు మొదలవుతాయోనని స్థానికులు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయి పోవడంతో రోడ్డు పక్కన నడకదారికి కూడా ఇబ్బందికరంగా ఉంటుందని వారు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే మోడల్ రహదారిలో సర్వీస్ రోడ్డు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఖాజాగూడలో మోడల్ రహదారి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్ : పాపిరెడ్డి కాలనీ, హఫీజ్‌పేట్, మదీనాగూడ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- మార్కెట్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 01.00 గంట వరకు ప్రేమ్‌నగర్ వెనుక వైపు, రోలింగ్ మిడోస్, సీఎం తోటవైపు, 100 ఫీట్ రోడ్డు ఇరువైపులా విద్యుత్ ఉండదని తెలిపారు.
- మార్తాండనగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి ఉదయం 11.30 గంటల వరకు మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ మెయిన్ రోడ్డు, ప్రేమ్‌నగర్ బి బ్లాక్, ప్రేమ్‌నగర్ వెనుక వైపు, హనీఫ్ కాలనీ ఏరియాలలో..
- ప్రేమ్‌నగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ప్రేమ్‌నగర్ వెనుక, 100 ఫీట్ రోడ్డు ఇరువైపుల, హఫీజ్‌పేట్, మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ బి బ్లాక్, హనీఫ్ కాలనీ ఏరియాలలో..
- ఆల్విన్ కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు ల్యాండ్‌మార్క్ రెసిడెన్సీ, ఆర్టీసీ కాలనీ, జెనిసిస్ స్కూల్, తులసీరాం చాంబర్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మియాపూర్‌లో..

మియాపూర్ : మయూరినగర్, రాంనరేష్‌నగర్ ఫీడర్ల పరిధిలో.. శుక్రవారం విద్యుత్‌ను నిలిపివేయడం జరుగుతుందని ఏఈ హరీష్‌సింగ్ తెలిపారు. మయూరినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు ఓల్డేజ్ హోం,మిత్రహిల్స్, ప్రశాంత్‌నగర్, ఎఎస్‌రాజ్ నగర్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, వర్టెక్స్ ప్రైమ్, అదేవిధంగా మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు 11కేవీ మయూరినగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం గంటల వరకు మయూరినగర్, ఎస్‌బిఐ బ్యాంక్ లైన్, ఓల్డేజ్ హోం ఆపోజిట్ ప్రాంతాలలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

మయూరినగర్, వికాస్ సబ్‌స్టేషన్ పరిధిలో...

మయూరినగర్, వికాస్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం 1 గంట నుండి 1.20 వరకు 11కేవీ లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలోని లక్ష్మీనగర్, డోవా కాలనీ,హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మధ్యాహ్నం 2 గంటల నుండి 2.30ల వరకు కేంద్రీయ విహార్ ఫీడర్ పరిధిలోని మయూరినగర్ పార్క్, కొలంబస్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

గచ్చిబౌలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

గచ్చిబౌలి: గచ్చిబౌలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా సరఫరాను శుక్రవారం నిలిపివేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఖాజాగూడ, గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్స్, హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్ కార్యాలయాలు, ఎస్ఏఎస్ ఇన్‌ఫ్రా, సాయిఐశ్వర్య లేఅవుట్, సాయివైభవ్‌కాలనీ, ఓక్రిడ్జ్ అంతర్జాతీయ పాఠశాల, చిత్రపురికాలనీ, ఎంఐజీకాలనీ, హెచ్‌ఐజీ, ఎల్ఐజీ, ల్యాంకో టవర్స్, అంకుర ఆస్పత్రి, రాయదుర్గం పోలీస్‌స్టేషన్, బయోడైవర్శిటీపార్కు, ఎంజేఆర్ బిల్డింగ్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

- శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి 1.30 గంట వరకు నానక్‌రాంగూడ విలేజ్, ఎమ్మార్ ప్రాపర్టీస్, గచ్చిబౌలి–లింగంపల్లి రోడ్డు, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, నిరీక్షణ్ భవన్, ఎస్‌బీఐ క్వార్టర్స్, బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

హఫీజ్‌పేట్‌లో..

హఫీజ్‌పేట్: ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కేఎస్ఆర్ రోడ్డు, రోడ్డు నెంబర్ 2,4,6,8,9,20,12 ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని అధికారులు తెలిపారు.

- పీజేఆర్ 11కేవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పీజేఆర్ ప్రాంతం, రోడ్డు నంబర్ 1,3,5,7,10,12 ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో స్టేట్ ఫస్ట్ భరత్‌సాగర్



భరత్ సాగర్‌కు సర్టిఫికెట్ అందిస్తున్న తెలంగాణ మ్యాథమేటిక్స్ ఫోరం సభ్యులు

గచ్చిబౌలి: ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించడంతో ప్రశంసలు అందుకుంటున్నాడు. మసీద్‌బండ జడ్పీహెచ్ఎస్‌లో దిండి భరత్ సాగర్ 10 తరగతి చదువుతున్నాడు. ఇటీవల నిజామాబాద్ యూనివర్సిటీలో తెలంగాణ మ్యాథమేటిక్స్ ఫోరం నిర్వహించిన స్టేట్ లెవల్ మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్ తెలుగు విభాగంలో మొదటి ర్యాంక్ సాధించారు. తెలంగాణ మ్యాథమాటిక్స్ ఫోరం భరత్‌కు సర్టిఫికెట్ అందించారు. వనపర్తి జిల్లా పానగల్ మండలం, మహ్మదాపూర్‌కు చెందిన దంపతులు బాలకృష్ణ, సత్యమ్మ 15 ఏళ్ల క్రితం బతుకుదెరువు కోసం కొండాపూర్‌కు వలస వచ్చారు. ఓ అపార్ట్‌మెంట్‌లో బాలకృష్ణ వాచ్‌మెన్‌గా పని చేస్తూ కొడుకు భరత్‌ను మసీద్‌బండ ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. 2021–22 విద్యా సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం అందించే ఉల్లాస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యాడు. ఇటీవల మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో స్టేట్ ఫస్ట్ రావడం ఎంతో ఆనందంగా ఉందని జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం అనంతరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.

కంకర క్రషర్లపై విచారణ



క్రషర్లను పరిశీలిస్తున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండల పరిధిలోని కంకర క్రషర్‌లపై అధికారులు విచారణ ప్రారంభించారు. మైనింగ్, రెవెన్యూ, పీసీబీ అధికారులు సంయుక్తంగా విచారణ చేపట్టారు. ఆర్డీఓ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఖాజీపల్లి, సోలక్‌పల్లి, రాళ్లకత్వ, శివానగర్, మాదారం గ్రామాల్లో గల 42 కంకర క్రషర్‌లపై అధికారులు విచారణ చేపట్టారు.గురువారం 21 కంకర క్రషర్‌లపై ఐదు బృందాలు విచారించారు. కంకర క్రషర్‌ల నిర్వహణ, కేటాయించిన భూమి, బ్లాస్టింగ్ తదితర విషయాలపై విచారణ చేసి తగిన నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని జిన్నారం ఆర్ఐ జయప్రకాశ్‌నారాయణ తెలిపారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ దత్తాత్రేయ కాలనీలో 35 లక్షల రూపాయల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఏఈ శ్రావణితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో శంకర్‌గౌడ్, సత్యనారాయణ, వెంకటేష్‌గౌడ్, మురళీకృష్ణ, శ్రీధర్, శేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, ఏఈ శ్రావణి తదితరులు

వాహనాలను జాగ్రత్తగా నడపాలి

రోడ్డు భద్రతపై అవగాహనా ర్యాలీ

గచ్చిబౌలి: రోడ్డు భద్రతపై ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్(ఎస్‌సీఎస్‌సీ), సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, శ్రీరామ్ లైఫ్ పార్టనర్స్ సంయుక్తంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పిస్తూ పలువురు ప్లకార్డులు ప్రదర్శించారు. వాహనదారులు, డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాదాపూర్ ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ జి రణవీర్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల ప్రభావం కుటుంబాల ఆర్థిక పరిస్థితిని తారుమారు చేస్తుందన్నారు. ప్రతి వాహనదారుడు జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ విధిగా ధరించాలని, కారుల్లో వెళ్ళేవారు సీటు బెల్ట్ ధరించాలన్నారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు హెడ్ రవికుమార్, ప్రాజెక్ట్ హెడ్ సునీత సాంబరాజు మాట్లాడుతూ భద్రతతో పాటు బీమా ప్రాముఖ్యతపై ప్రజల్లో మరింత అవగాహన అవసరమన్నారు. అనంతరం రైడర్లకు హెల్మెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గచ్చిబౌలి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్ రాజశేఖర్‌రెడ్డి, నవేద్‌ఖాన్, కేశవ్‌బండారి, ట్రాఫిక్ సిబ్బంది, శ్రీరామ్ లైఫ్ పార్టనర్స్ బృందం పాల్గొన్నారు.



విధిగా హెల్మెట్ ధరించాలని సూచిస్తున్న ట్రాఫిక్ పోలీసులు



ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో రోడ్డు భద్రతపై బైక్ ర్యాలీలో పాల్గొన్న వారు

పాలపిట్ట పార్కు పనివేళలు

గచ్చిబౌలి: కొత్తగూడలోని తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, హైదరాబాద్ బైసైక్లింగ్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే పాలపిట్ట పార్కు పనిచేయు వేళలు..

- ఉదయం..6 గంటల నుంచి 10 గంటల వరకు
- సాయంత్రం..3 గంటల నుంచి రాత్రి 6 గంటల వరకు

సైకిళ్ల అద్దె వివరాలు..

- అడల్ట్స్/కిడ్స్/టీన్ సైకిల్
- ప్రతి గంటకు రూ.59 చార్జీ
- నెలవారీ పాస్ రూ.944 (నెలవారీ చార్జీ)

భళా.. నృత్య భంగిమ



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న చేనేత వస్త్ర ప్రదర్శన గాంధీ బంకర్ మేళాలో భాగంగా ఆంఫీ థియేటర్‌లో గురువారం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. మురారి రామ్‌మోహన్‌రావు శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది. ఇందులో వినాయకకౌతం, భామాకలాపం, కృష్ణశబ్దం, పూజ నృత్యం, గణేశకౌతం, రామాయణశబ్దం, శివస్తుతి, బృందావనం, జతిస్వరం తదితర అంశాలను హన్సిక, రసజ్ఞ, శ్రీపాద, దీక్షిత, అవంతిక, శ్రీకృతి, వంశిక, సాయి, గాయత్రి తదితరులు ప్రదర్శించారు.

డ్రంకన్ డ్రైవ్.. ఆరుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ, బుధవారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఆరుమంది వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికీ రూ. 10 వేల జరిమానా, అందులో ఒకరికి 5 రోజులు జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

పింఛన్ మంజూరు పత్రాలు అందజేత

పటాన్‌చెరు టౌన్: చందాదారులకు చేరువయ్యే విధంగా ప్రయాస్ పథకం ద్వారా ఉద్యోగ విరమణ పొందుతున్న నెలలోనే పింఛన్ పత్రాలు అందజేస్తున్నామని పటాన్‌చెరు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల అగర్వాల్ పేర్కొన్నారు. గురువారం పటాన్‌చెరు పీఎఫ్ కార్యాలయంలో జనవరి నెలలో 27 మందికి పింఛన్లు మంజూరు చేయగా, అందులో 9 మందికి పింఛను మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పి.ఎఫ్ కమిషనరు ఆర్.శ్రీదేవి, అకౌంట్స్ అధికారి మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏఎంఅండ్‌హెచ్‌ఓపై బదిలీ వేటు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి సర్కిల్–20 ఏఎంఅండ్‌హెచ్‌ఓ డా.నగేష్‌పై జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ బదిలీ వేటు వేశారు. ఆయన స్థానంలో యూసుఫ్‌గూడ సర్కిల్ ఏఎంఅండ్‌హెచ్‌ఓగా పని చేస్తున్న డా.కె.ఎస్.రవికుమార్‌ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం జీహెచ్ఎంసీ కమిషనర్ దుర్గం చెరువు రోడ్డును సందర్శించిన అనంతరం వెస్ట్ జోనల్ కార్యాలయంలో అధికారులతో శానిటేషన్‌పై సమీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. కమిషనర్ ఆదేశాలతో దుర్గం చెరువు రోడ్డులో తోపుడుబండ్లను ఆగమేఘాల మీద తొలగించారు. ఇదే విషయంలో బదిలీ వేటు పడిందనే చర్చ జరుగుతోంది. కాగా డా.కె.ఎస్.రవికుమార్ గతంలో శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్లలో సుదీర్ఘ కాలం పని చేశారు. గురువారం ఆయన ఏఎంఅండ్‌హెచ్‌ఓగా బాధ్యతలు తీసుకున్నారు.

సైబరాబాద్ కమిషనరేట్‌లో క్రీడా సందడి



వాలీబాల్ ఆడుతున్న పోలీసు సిబ్బంది

ఘనంగా వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్–2024

రాయదుర్గం: నిత్యం విధుల్లో బిజీగా ఉండే పోలీసు సిబ్బంది ఉల్లాసంగా, ఉత్సాహంగా క్రీడాపోటీల్లో పాల్గొని సందడి చేశారు. సైబరాబాద్ కమిషనరేట్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సీపీ అవినాష్ మహంతి ఇతర పోలీసు అధికారులతో కలిసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ జోన్‌ల నుంచి వచ్చిన పోలీసు క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ పోటీలు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి.

క్రీడలతో ఒత్తిడి దూరం:

–సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

విధి నిర్వహణలో ఒత్తిడి నుంచి బయటపడేందుకు క్రీడలు దోహదం చేస్తాయని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి అన్నారు. క్రీడా పోటీలను ఆయన ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం బిజీగా ఉండే పోలీసు సిబ్బంది ఆరోగ్యం, మానసికోల్లాసం కోసం ఏటా స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శారీరక ధృడత్వాన్ని కాపాడుకోవడానికి క్రీడలు దోహదపడతాయన్నారు. తెలంగాణ పోలీసు సిబ్బంది ఎన్నో ప్రతిష్ఠాత్మక అవార్డులు అందుకున్నారన్నారు. సైబరాబాద్ సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్ మాట్లాడుతూ మూడు రోజులపాటు జరగనున్న పోటీల్లో వివిధ జోన్లు, విభాగాలకు చెందిన పోలీసు క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. 1000 మందికి పైగా సిబ్బంది పోటీల్లో పాల్గొంటున్నారని, వారిలో 150 మంది మహిళలు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీపీలు నర్సింహ, శ్రీనివాసరావు, డాక్టర్ జి వినీత్, నారాయణరెడ్డి, శ్రీనివాస్, నితికాపంత్, రవిచందన్‌రెడ్డి, అశోక్, కె శిల్పవల్లి, రషీద్, సృజనాకర్ణం, ఏడీసీపీలు రష్మీ పెరుమాళ్, షమీర్, శ్రీనివాసరావు, జి నర్సింహారెడ్డి, ఏసీపీలు, సీఏఓ అకౌంట్స్ చంద్రకళ, సీఏఐ అడ్మిన్ గీత, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు పాల్గొన్నారు.

బస్సుల కొరత..

- గ్రామాలకు తగ్గిన ఆర్టీసీ బస్సులు
- ఫుట్‌బోర్డు పైనే విద్యార్థుల ప్రయాణం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాలకు ఆర్టీసీ బస్సులు తగినన్ని లేకపోవడం, ఉన్నవి సమయానికి రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ,అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. జిన్నారం, గుమ్మడిదల మండలాల గ్రామాలకు ఆర్టీసీ బస్సులు సరిగా లేకపోవటంతో ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రమైన జిన్నారానికి నర్సాపూర్ డిపో బస్సులు సమయానికి రావటం లేదని, జీడిమెట్లకు చెందిన బస్సులను నడపాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాలేజీలు, ఉద్యోగాలకు వెళ్లే వారికి సమయానికి బస్సులు లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. బొల్లారం మున్సిపల్ నుంచి మండల కేంద్రమైన జిన్నారానికి ఏళ్ల తరబడి బస్సులు లేవు. దీంతో బొల్లారం నుంచి మండల కేంద్రమైన జిన్నారానికి వచ్చేందుకు ప్రజలు అవస్థలు పడాల్సి వస్తుంది. గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. దీంతో ప్రజలు ఆటోల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినా బస్సులు అందుబాటులో లేవంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుమ్మడిదల, బొంతపల్లి, అన్నారం, దోమడుగు గ్రామాల నుంచి ఉదయం కాలేజీలు, పాఠశాలలకు వెళ్లేందుకు తగినన్ని బస్సులు లేకపోవటంపై విద్యార్థులు పలుమార్లు ఆందోళనలు చేశారు. ఉదయం వేళల్లో బస్సుల సంఖ్యను పెంచాలని విద్యార్థులు కోరుతున్నారు. బస్సుల సంఖ్యను పెంచటంతో పాటు సమయపాలన పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బస్సుల సంఖ్యను పెంచాలి

ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలి. ప్రస్తుతం ఉన్న బస్సులు సరిపోవటం లేదు. గతంలో కన్నా బస్సుల సంఖ్య తగ్గింది. బస్సులు లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నాం.

– లత, జిన్నారం

ఆందోళనలు చేసినా పట్టించుకోలేదు

బస్సుల కోసం ఆందోళనలు చేసినా ఉపయోగం లేదు. బొల్లారం నుంచి జిన్నారానికి బస్సులు నడపాలి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

–నరేందర్, జిన్నారం

ఆర్టీసీ అధికారులకు విన్నవించాం

ఆర్టీసీ బస్సులు పెంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరాం. బస్సుల సంఖ్య తగ్గటం, సమయపాలన లేకపోవటంపై అధికారులకు వివరించాం. త్వరలోనే ఈ సమస్య పరిష్కారం అవుతుంది.

– రవీందర్‌గౌడ్, ఎంపీపీ, జిన్నారం

వ్యసనాలకు అలవాటుపడి..

- ద్విచక్రవాహనాలు దొంగిలించిన కేసులో ముగ్గురికి రిమాండ్
- రూ.5.50 లక్షల విలువ గల వాహనాలు స్వాధీనం



మాదాపూర్: వ్యసనాలకు అలవాటుపడి ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న ముగ్గురిని గురువారం మాదాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఈస్ట్ గోదావరికి చెందిన ముగ్గురు నరాలశెట్టి జయసూర్య(20) మోతీనగర్‌లో ఉంటూ ఆఫీస్‌బాయ్‌గా పనిచేస్తున్నాడు. వాసంశెట్టి మణికంఠ శ్రీనివాసులు(20) మాదాపూర్‌లోని పర్వత్‌నగర్‌లో నివాసముంటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. కె.సతీష్(22)నార్సింగ్‌లో నివాసముంటూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరంతా ఈనెల 1వ తేదీ సాయంత్రం 6గంటలకు ద్విచక్రవాహనంపై వస్తుండగా తనిఖీల్లో భాగంగా వాహన పత్రాలను చూపించమని అడుగగా తప్పించుకునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి రూ.5.50 లక్షల విలువగల ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

విద్యుత్ మీటరుకు ఫోన్ నంబర్ లింకు చేసుకోవాలి

గచ్చిబౌలి: విద్యుత్ మీటర్లకు ఫోన్ నంబర్లను లింక్ చేసుకోవాలని వైట్ ఫీల్డ్స్ సబ్‌స్టేషన్ ఏఈ కిశోర్ తెలిపారు. విద్యుత్ బిల్లులు, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నా సంబంధిత ఫోన్ నంబర్‌కు ముందుగానే సమాచారం వస్తుందన్నారు. అకస్మాత్తుగా విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్య తలెత్తినా తిరిగి విద్యుత్ సరఫరాను ఎప్పుడు పునరుద్ధరిస్తారనే ముందస్తు సమాచారం వస్తుందని సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారులు విద్యుత్ మీటరుకు ఫోన్ నంబర్‌ను లింక్ చేసుకోవడం లేదా tssouthernpower.com ఫోన్ నంబర్‌ను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు.